# జనం ఏమంటారు?

– అమృతా ప్రీతమ్

ఆ బజారంతా పెద్దపెద్ద యిళ్ళు. రెండతస్తుల మేడలు కూడ వున్నాయి. మేడ పక్క ఖాళీ స్థలంలో అతిధుల కోసం చిన్న గది కూడ వుంది కొన్ని యిళ్ళలో.

యీ యిల్లూ అలాంటిదే. పెద్ద మేడ. మేడ పక్కన చిన్న గది. మొదటి అంతస్తులో వొక స్త్రీ వొక పురుషుడూ యింకా మేల్కొనే వున్నారు.

రాత్రి బాగా పొద్దు పోయినా వాళ్ళిద్దరూ నిద్ర పోలేదు. ఆమె నెమ్మదిగా అడిగింది. "ఏం? నిద్ర పట్టటం లేదా?"

"కునుకు పట్టినట్టే పట్టి మళ్ళీ మెలకువొస్తున్నది."

"కిటికీ లోంచి వెలుతురొస్తోంది, అందుకే నిద్ర పట్టడం లేదేమో? కిటికీ మూసేయనా?

అతను కొంచెమాగి గొణిగాడు. "వద్దులే గాలి రానీ".

ఆమె నవ్వింది. "యివాళ యీ గదిలో పడుకోవటం వింతగా వుంది."

"అవును. నా క్కూడా కొత్తగానే వుంది."

"నేనిక్కడ నాలుగైదు రోజులున్నానో లేదో మీరు నన్ను మేడ మీద కెళ్ళమన్నారు."

అతను యిబ్బందిగా మొహం పెట్టాడు. "నేనివ్వలేని సుఖం నీ కత నిచ్చాడు."

ఆమె గొంతు బొంగురు పోయింది, "ఆయన మీ నాన్న". "అవును, నిజమే. అయితే"

"అంతేలే, యిదే కదా పదేళ్ళ కిందట మీరు నాకు చెప్పింది. ఆయనిక మారడు. ఆస్తంతా బజారోళ్ళ మీద తగలేస్తున్నాడని యింట్లో మనిషిని నన్ను ఆయన దగ్గరికి పంపారు. అలాగన్నా ఆస్తి మిగులుద్దని".

"ఆ! ఏమిమ్మిగిలింది లే! నిన్ను బొంబాయి మాటీ పెద్ద పెద్ద హోటళ్ళన్నీ తిప్పాడుగా. వేలకి వేలు తగలేశాడు". అన్నాడతను దిండు గట్టిగా పట్టుకొని.

నీడ నెమ్మదిగా గోడని నింపేస్తోంది. "మీరే కదా ఆయనతో వెళ్ళమన్నది?" అన్నదామె కొంచెం కోపంగా.

"అందుకేగా అమ్మని వరండా గదిలోకి పంపింది."

"ఆమె ఎవరితో నన్నా చెప్తే ఎలా వుండేదో?" నిట్టూర్చుతూ అన్నది.

అతను వెంటనే అన్నాడు. "ఎలా చెపుతుంది? జనం ఏమంటారోనని భయం కాదూ? అందుకే రాత్రింబవళ్ళూ పూజలు చేసేది. ఎవరన్నా ఆ బయట గదిలో ఒక్కతే ఎందుకుంటున్నావని అడిగితే ఏమనేది? యిల్లు చూసుకోడానికి కోడలొచ్చిందిగా. పైకి పోయే దానికి నాకే ముందిక పూజలు తప్ప అనేది."

"అయినా యింట్లో జరిగేదంతా ఆమెకి తెలుసు."

అతను మాట్లాడలేదు.

మళ్ళీ ఆమే అన్నది. "అందుకే దేవుడామెని తొందరగా తీసుకుపోయాడు. యింకేమి మిగిలిందామెకు?"

కిటికీలోంచి పడుతున్న వెలుగుని చాలా సేపు చూసి అడిగింది. "మీ కివాళ చాల ఆనందంగా వుండాలి. కాఫీ కలపనా?"

"సరే చెయ్యి?"

ఆమె లేచి హాల్లో లైటు వేసి, వంట గదిలో కెళ్ళింది. కాఫీ రెండు కప్పుల్లో తెచ్చి మంచం పక్క పెట్టింది. "లైట్లు వేయనా?"

"వద్దులే. యిలానే వుండనీ".

చీకట్లో కప్పు తీసి అతని కందించింది. నెమ్మదిగా. అతను మంచం మీద లేసి కప్పందుకున్నాడు.

కాఫీ చప్పరిస్తూ అంది. "అవును మీకివాళ చాలా సంతోషంగా వుండాలి."

అతను మాట్లాడకుండా కాఫీ తాగుతున్నాడు.



"నేను కాపురానికొచ్చినపుడు మీరే వన్నారు? యిక్కడే యీ గదిలోనే. గుర్తుందా? యి యిల్లు నాది కాదు. మా నాన్నది. మేం నలుగురు అన్నదమ్ములం పంచుకోవాలి దీన్ని' అన్నారు.'

ఆమె నవ్వుతూ అంది, "యిక యీ యిల్లంతా మీదే. మీకే రాసిచ్చి పోయాడాయన.'

"వాళ్ళ ముగ్గురికీ అమెరికాలో యిళ్ళున్నయిలే".

"వుంటే మాత్రం. యీ యింటి మీద వాళ్ళకీ హక్కుందిగా"

"పెద్దన్నయ్య నిన్నేమన్నా అడిగాడా?"

"మీ నాన్నగారి పేపర్లన్నీ ఎక్కడున్నా' యని అడిగాడు. నేనే విల్లు చూపించాను."

"ఏవన్నాడు?"

"ఏమన్లా, ఫరవాలేదులే. నాన్నగారికి మేమేం చేయలేదు. తమ్ముడే చూసుకొన్నాడు. అన్నాడు."

అతను మౌనంగా వున్నాడు.'

మళ్ళీ ఆమే అన్నది. "ఆయన పోయే టప్పుడు యిల్లంతా నా పేరు మీదే పెడ తానన్నారు. మీరే వద్దన్నారు."

"నీ పేరు మీద రాస్తే వూళ్ళో వాళ్ళంతా ఏమనుకొంటారో ముసలాయనికి తెలుసులే".

"యిక మీ యిల్లూ ఆస్తీ పదిలంగా వున్నాయిగా మీ దగ్గరే".

చాలా సేపు ఎవరూ మాట్లాడలేదు.

అతనడిగాడు నెమ్మదిగా. "డాక్టరేం చెప్పాడో తెలుసా నీకు"?

"ఎందుకు తెలీదు? తెలుసు". అన్నదామె నీరసంగా.

"యిక నీకు పిల్లలు పుట్టరని తెలిస్తే ఏమనిపిస్తుంది?"

కడుపులో కాఫీ తిప్పినట్లయిందామెకి. "నువ్వే కదా నా కడుపు తీయించేశావు. అప్పుడే జరిగిందిదంతా. నా తప్పేముంది?"

తన నరాలన్నీ మరిగిన మంట గొంతు లోంచి బయట కొచ్చినట్లు ఆమె పెదవులు కదిలాయి. నువ్వెందుకు నా బిడ్డను తీయించేశావు?"

దిక్కుల నుంచి జారుతున్న నీడలు ఆమె వొంట్లోకి చొచ్చుకెల్తున్నాయి. "పిల్లలు కోసం మళ్ళీ పెళ్ళి చేసుకోవాలను కొంటున్నారా? నన్నొదిలేస్తారా?"

అతనేమీ మాట్లాడలేదు.

మిగిలిన కాఫీ మింగేస్తూ అడిగింది. "ఏం మాట్లాడరెందుకని ?"

"పిల్లల్లేకపోతే యీ మేడా ఆస్తీ అంతా ఏమైపోవాలి?" అన్నాడు.

శరీరాన్ని చీరి మాంసాన్ని లాగినట్లు అతని చొక్కా గట్టిగా పట్టుకు లాగింది. "మరి నా బిడ్డ నెందుకు తీయించేశావు?"

ఆమె చేతిని వదిలించుకొంటూ అన్నాడు. "బిడ్డనాదో ఆయనదో తెలీదు కదా?"

ఆమె చేతిలోంచి కిందపడ్డ కప్పు పగల్లేదు. ఆమెకి తనే పగులుతున్నట్లుంది.

"నిన్నిల్లు వదిలిపెట్టి వెళ్ళమనలేదుగా? వరండా పక్క గదిలో సుఖంగా వుండవచ్చు." నింపాదిగా అన్నాడతను.

ఆమెకి ఏడుపు తన్నుకొచ్చింది. ఏడుస్తూ అంది. "ఎక్కడా? అక్కడేనా? మీ నాన్న మీ అమ్మని యింట్లోంచి తరిమేసి వుంచాడు. అక్కడేగా?"

అతనేమీ మాట్లాడలేదు.

"నేను యిదంతా అందరికీ చెప్తే?" మౌనాన్ని ఛేదిస్తూ అన్నదామె.

"నువ్వేం చేశావో చెప్పగలవా అందరికీ? జనం ఏమంటారు?"

ఆమెకి గొంతు పెగల్లేదు.

మళ్ళీ అతనే అన్నాడు. "ముసలాడు తొందరగా పోతాడేమో - డబ్బంతా మిగుల్తుంది - మనం సుఖంగా వుండొచ్చను కొన్నా. యిన్నేళ్ళు బతికాడు."

ఆమె లోలోపల్నించి పెగులుతూ ఒక్కొక్క మాటే వినపడింది. "కాదు. నేను నేనూ యిన్నాళ్ళు బతికే వున్నాను."

కొద్దిగా వెలుతురు వస్తుండగానే ఆమె లేచి యింటి గేటు తీసి బయట కెళ్ళింది.

అతను పరుగెత్తుకెళ్ళి ఆమె కడ్డం నుంచున్నాడు. "ఏవిటి? ఎక్కడి కెల్తున్నావు?"

తల తిప్పకుండా జవాబిచ్చింది. "పదేళ్ళ కిందటే వెళ్ళాల్సిన చోటికి. నువ్వు నన్నతని దగ్గరికి పంపించిన రోజే వెళ్ళాల్సిన చోటికి."


Resi : 424900
436204
Shop : 422698

22 క్యారట్సు బంగారమునకు మంచి
పనితనమునకు గ్యారంటీ వున్నది. వెండి,
బంగారు నగలకు మా గ్యారంటీ
మీకు కావలసిన కొత్త డిజైన్‌లు
ఆర్డర్ పైన సకాలంలో
తయారు చేయించి యివ్వగలవారము.



ది హిందూస్థాన్ జ్యూయలరీ &
రంగూన్ కెమికల్ డైమండ్ కంపెనీ
బంగారం వెండి నగల వ్యాపారం
శివాలయం వీధి, విజయవాడ - 520 001.